గ్రహణం పట్టిన రాత్రి

చలి మరీ విపరీతంగా వుంది. ఎముకల్ని కొరికేస్తుంది. మనసుని తొలిచేస్తుంది. రెండు పెగ్గులు ట్రిబులెక్స్ రమ్ము పట్టించి, రూం కిటికీ తలుపులు బిగించి వేసినా చలి తగ్గటంలేదు శ్రీధరంకు ఏం తోచడంలేదు. నిద్రపట్టి చావటంలేదు. శరీరానికే కాదు—మనసులోనూ చలి మరీ దంచేస్తూంది.

"వింటర్‌లో ఒంటరిగా వెళ్ళకోకు" అన్న కవిత గుర్తొచ్చింది శ్రీధరంకు. అప్పుడెప్పుడో ఆ కవిత చదివినపుడు 'రేయిమ్‌కోసం వ్రాసిన పోయమ్' అని అనిపించింది శ్రీధరంకు. కవి ఆ మాట ఎందుకు చెప్పాడో ఇప్పుడు బాగా అర్ధమవుతోంది శ్రీధరానికి.

మనసులో పుట్టి నరాలను తట్టుతున్న చలి గది తలుపులు మూస్తే పోతుందా—మదిలో తలపులు చల్లారాలిగాని, మంచం మీద వెల్లికిలా పడుకొని తిరగని సీలింగ్ ఫాన్‌వైపు చూస్తూ ఆలోచనల్ని మేస్తున్నాడు శ్రీధరం.

గదిలో ఒంటరితనం.

మదిలో తుంటరితనం మొదలవుతోంది.

కంటికి ఏవో రూపాలు లీలగా గోచరిస్తున్నాయి. ఒంటికి సుతిమెత్తని వేడి సోకాలి. ఆ వేడి ప్రతి నరానికి పాకాలి. యవ్వనంలోనున్న మగాడికి — అందునా వంటరిగా—కోరికలు గుర్రాల్లా పరుగులు తీస్తాయ్. పెగ్గు పుచ్చుకున్నా, రగ్గు కప్పుకున్నా ఆ చలి వదిలేట్టు లేదు. మనసులో పెరుగుతున్న కోరికల తాలూకు చలి ఆగేట్టు లేదు.

శ్రీధరం లేచి గదిలో పచార్లు చేయసాగాడు. ఎంత ఆఫీసుపనయినా డిసెంబర్‌లో హైద్రాబాద్ వంటరిగా వచ్చి వుండాల్సింది కాదు. అర్ధాంగి ఎంత అర్థించినా రెండు రోజుల పనేగా అని ఒక్కడే బయలుదేరాడు. రెండు రోజుల్లో పూర్తవుతుందనుకున్న పని నాలుగు రోజులయినా యింకా మొదలవలేదు. పెళ్ళికాక పూర్వం చలిరోజుల్లో శ్రీధరం చాలాసార్లు వచ్చాడు హైద్రాబాద్. పెళ్ళయాక రావటం ఇదే మొదటిసారి. అంతకుముందు తనని బాధించని చలి ఇప్పుడెందుకు కలవరపరుస్తుందో శ్రీధరానికి అంతుపట్టటం లేదు.

టేబిల్ మీదున్న పాకెట్ అందుకొని గోల్డ్‌ఫ్లాక్‌కు లైటరును జత చేశాడు శ్రీధరం. లైటర్ వేడిని అందుకొని, ఆ వేడిలో కరిగిపోతూ మైమరచిపోతున్న సిగరెట్ తృప్తిగా పొగరూపంలో నిట్టూర్పులొదులుతున్నట్లు అనిపించింది శ్రీధరానికి. సిగరెట్‌ను కసిగా దూరంగా

నాగభైరవ ఆంజనేయులు

విసిరేసి మంచంమీదికి చేరాడు శ్రీధరం.

మనసులో కోరికలు ఉధృతమవుతు న్నాయ్. అంత చలిలోనూ శ్రీధరం నుదుట చిరుచెమట పట్టింది. కాలింగ్ బటన్ నొక్కి లేచి వెళ్ళి తలుపు గడియ తీసి వచ్చాడు. రెండు నిముషాల్లో రూం బాయ్ తలుపు తోసుకొని లోపలకి వచ్చాడు. బాచంపట్టా వేసుకొని, గొంతు వరకు తగ్గు కప్పుకొని సన్నగా వణుకుతూ నడిమంచంలో కూర్చొని వున్నాడు శ్రీధరం. అతని వింత అవస్థకు రూం బాయ్ మనసులోనే ముసిముసిగా నవ్వు కున్నాడు.

"ఏం కావాలి సార్?" రూం బాయ్ అతివినయాన్ని వెళ్ళబోశాడు.

శ్రీధరంకు ఏం చెప్పాలో తెలియ లేదు. ఎలా చెప్పాలో అర్థం కాలేదు. అసహనంగా అటూ, ఇటూ కదిలాడు. గొంతు తడారిపోయినట్లయి, మాట పెగిలి రాలేదు.

రూం బాయ్ మళ్ళీ అడిగాడు.

"చాలా చలిగా వుందోయ్. నిద్రపట్టి చావటంలేదు ఏదైనా " తడబడుతూ కంపించే స్వరంతో మాటల్ని తుంచుతూ నసిగాడు శ్రీధరం. చూపుల్లోనూ, ముఖం లోనూ తన భావాన్ని వ్యక్తం చేయటానికి సాధ్యమయినంతవరకు ప్రయత్నించాడు.

రూం బాయ్ యిలాటి కేసులు చాలా చూశాడు. ఈ కేసుల్లో వాడి మనసు రేసు గుర్రాల్లా పరుగులు తీసి గెలుపును సాధి స్తుంది.

"అలాగే సార్ పది నిముషాల్లో పట్టుకొస్తా .. సరికొత్త సరుకు." అని చేతులు నలుపుకుంటూ నెలకెసి, గది కప్పుకేసి మార్చి మార్చి చూస్తూ అలానే నిలబడిపోయాడు.

శ్రీధరం వాడిని పరీక్షగా చూశాడు. పర్సులోంచి ఇరవై రూపాయల నోటు తీసి వాడి కందించాడు. 'కీ' ఇచ్చి వదిలిన బొమ్మలా రక్కున వెనుదిరిగి బయటకు పరుగుతీశాడు రూం బాయ్.

* * *

ఫ్లాస్క్‌లోని టీని కప్పుల్లోకి వంచి ఒకటి ఆమెకు అందించాడు శ్రీధరం. అందుకుంటుంటే వేళ్ళు కాలాయి. కప్పు తగిలో, అతని వేళ్ళు తగిలో మరి. శ్రీధరం మనసులో బెరుగ్గా వుంది. కుర్చీలో కూర్చొనివుంది ఆమె. మంచం అంచుమీద కూర్చొనివున్నాడు శ్రీధరం.

'మీ పేరు ' టీ సిప్‌చేస్తూ కప్పు అంచుమీదుగా ఆమె నుదుటిపై కదలాడు తున్న ముంగురులవైపు చూస్తూ శ్రీధరం అడిగాడు.

'అమృత ' చల్లని పెదవులు టీ వేడికి తెరుకుంటుండగా మెత్తగా పలి కింది.

"చాలా బావుంది." ఖాళీ కప్పును టేబిల్‌మీదుంచుతూ శ్రీధరం అన్నాడు.

" 'టీ'యా " సిగ్గుపడుతున్నట్లు తల కొద్దిగా వంచుకొని, పల్చగా నవ్వుతూ వాలుగా తలయెత్తి చూస్తూ చమత్క రించింది.

పల్చగా నవ్వుకున్నాడు శ్రీధరం.

"పేరు మీరు "కర్చీఫ్‌తో పెదాలు అద్దుకున్నాడు.

కనురెప్పలు పైకెత్తి తేటగా పరికించి

చూస్తూ "నాకేం బాగాలేదు" అంది పొడిగా.

"ఏమిటి?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు శ్రీధరం.

"నన్ను మీరు అంటూ గౌరవించటం. గౌరవం లేనివారిని గౌరవించటం తమను తామే అగౌరవపరచుకోవటమవుతుంది. ఇది గౌరవనీయులు చేయకూడదు."

"ఎదుటి మనిషిని గౌరవించటం సంస్కార లక్షణం."

"ఈ తప్పు పనికి సరికొత్తవాడిలా వున్నాడు" అని మనసులోనే అనుకొంది అమృత.

సన్నగా నవ్వింది. నవ్వి శ్రీధరం వైపు కొంటెగా చూసింది. చూస్తూ క్రైపుగా కనురెప్పలు వాల్చింది. ఆ కనురెప్పల మాటున ఏదో తీయని భావాన్ని వ్యక్తం చేసింది నేర్పుగా.

శ్రీధరం మనసు ఊగింది.
ఆనందంతో తులతూగింది.
తీయని ఆలోచన రేగింది.
నర నరంలోనూ సాగింది.

చిలిపిగా ఆమె కళ్ళలోకి చూశాడు. ఆ కళ్ళలో పండిన మైకాన్ని తూచాడు. ఆ కళ్ళవెనుక దాగిన మత్తును తలబోచాడు.

"అదిగో టేబిల్ మీద పర్సుంది. పర్సులో డబ్బుంది. నీకు కావల్సింది తీసుకో. సందేహించకు" ముద్దగా వున్నాయ్ శ్రీధరం మాటలు.

అమృత నిశ్శబ్దంగా నవ్వింది, విరిసిన మల్లెపూవులా, పరచుకున్న లేత వెన్నెల తావిలా.

శ్రీధరం లేచి బాత్ రూంలోకినడిచాడు. అమృత అతని పర్సును చేతిలోకి తీసుకొంది.

*   *   *

పది నిముషాల తర్వాత కుషీగా ఈల

వేసుకుంటూ బాత్‌రూంలోనుండి బయటకు వచ్చాడు శ్రీధరం. చుట్టూ ఒకసారి చూశాడు. కళ్ళు పెద్దవి చేసుకొని మరీ చూశాడు. అటూ యిటూ మళ్ళీ మళ్ళీ చూశాడు. సోఫా చాటున, మంచం అడుగున చూశాడు.

ఉహూఁ లేదు. అమృత ఆ గదిలో లేదు. శ్రీధరం మనసు కుతకుతలాడింది.

గుండె గొంతుకలోకి లాగినట్లని పించింది. ఒళ్ళంతా వేడెక్కింది. పళ్ళ మధ్య క్రింది పెదవిని నొక్కిపట్టి, కుడి చేతి పిడికిలిని ఎడంచేతిలో రాస్తూ ఆలో చించాడు. తీవ్రంగా ఆలోచించాడు.

ఒక్క అంగలో టేబుల్ దగ్గర కెళ్ళాడు. టేబిల్‌మీద అమృత తెచ్చిన వానిటీబాగ్ లేదు. పర్సు యధాస్థానంలోనే వుంది. పర్సు చేతిలోకి తీసుకొని నోట్లు గబగబా లెక్కపెట్టాడు. సరిగ్గా వున్నాయ్.

ఆమె ఏమైనట్లు? ఎందుకు వెళ్ళిపోయి నట్లు?

డబ్బుకోసం వచ్చిన మనిషి డబ్బు లేకుండా ఒట్టి చేతుల్తో వెళ్ళిపోయింది.

కారణం ఏమిటి?

ఆలోచిస్తూ శ్రీధరం టేబిల్‌మీదున్న వీక్లీవైపు చూశాడు.

"క్షమించండి. ఈ రాత్రి మీతో గడప లేను."

వీక్లీ అట్టమీద గబగబా గీకినట్లు న్నాయి అక్షరాలు.

శ్రీధరానికి అంతా అగమ్యగోచరంగా వుంది. విచిత్రంగా తోస్తుంది. తనంటే ఆమెకు యిష్టం లేకనా! వెలయాలికి వెల తోనే పనిగాని యిష్టాయిష్టాలతో ప్రసక్తి ఏం వుంటుంది!

ఆమెకు కావల్సినంత డబ్బు తనివ్వ గలడు. కావల్సినంత తీసుకోమన్నాడు కూడా!

మరి మరి ఎందుకు వెళ్ళిపోయింది? డబ్బు లేకుండా ఎందుకు తిరిగి వెళ్ళి పోయింది.

ఎందుకు? ఎందుకు?? ఎందుకు???

శ్రీధరానికి పిచ్చెత్తినట్లయింది. ఆలోచ నలు మనసుని నలిపేస్తున్నాయ్. సందే హాలు మెదడును పీక్కు తింటున్నాయ్. జరిగిన సంఘటనను ఏ విధంగానూ సమ న్వయించుకోలేక పోతున్నాడు.

సిగరెట్ అంటించి గట్టిగా నాలుగు దమ్ములాగి విసుగ్గా పొగను గాలిలోకి వదిలి బలంగా కాలింగ్‌బటన్ నొక్కాడు. రూంబాయ్ పరుగున వచ్చి రూంలో శ్రీధరాన్ని ఒక్కణ్ణే చూసి అయో మయంగా నిలబడ్డాడు. శ్రీధరం అంత చిరాగ్గా ఎందుకున్నాడో, అసలేం జరి గిందోనని ఆలోచిస్తున్నాడు.

శ్రీధరం పర్సు తెరిచి కొన్ని నోట్లు వాడి చేతిలో కుక్కి "విస్కీ" అన్నాడు విసురుగా.

రూంబాయ్ అనుమానంగా చూశాడు.

"గెటిట్ యిమిడియెట్లీ" కోపంగా అరిచాడు శ్రీధరం.

*   *   *

ఖాళీ విస్కీ బాటిల్‌లో అగ్గిపుల్ల గీసి పడేసి మూత బిగించాడు శ్రీధరం. 'టప్' మంటూ వింత ధ్వని రావటంతో పక పకా నవ్వాడు శ్రీధరం. ఆ సీసా



వైపు చూస్తూ పెద్దగా పిచ్చిగా నవ్వాడు. అలా తెరలు తెరలుగా నవ్వుతూ కుర్చీ లోంచి లేచి తూలుతూ నడిచి వెళ్ళి మంచంమీద అడ్డంగా పడ్డాడు.

ఒకటి రెండు పెగ్గులకన్నా ఎక్కువ పుచ్చుకునే అలవాటు లేని శ్రీధరం మొదటి సారిగా ఆ రోజు బాటిల్‌ను పూర్తి చేశాడు.

ఆ మైకంలో శ్రీధరం కళ్ళకు అమృత వివిధ రూపాల్లో పంచ రంగుల్లో కను పిస్తూ, కవ్విస్తూ అతన్ని మరీ రెచ్చగొట్ట సాగింది. ఆ ఆలోచనలతో అలానే మత్తు లోకి ఒరిగిపోయాడు శ్రీధరం.

* * *

- సరిగ్గా అదే సమయానికి

అమృత తన గదిలో ఫోంబెడ్డు మీద వెల్లకిలా పడుకొని తన బాల్య స్నేహితు రాలు రాధ ఫోటోవంక తదేకంగా చూస్తూ మనసులోనే భోరున ఏడ్చింది.

రాధ. నిరుపేదయైన తనను ప్రాణంతో సమంగా చూసుకున్న లక్షాధికారి ఏకైక పుత్రిక రాధ. తరచు ఆర్థికంగా ఆదు కుంటూ తన చదువు కొనసాగటానికి ఎన్నో విధాల సాయపడిన రాధ. అంతే కాదు . కనుపించే తన ఆరాధ్య దైవం రాధ.

రాధీ జీవితం వైకుంఠపాళి. కొందరు అదృష్టవంతులు వెంట వెంటనే నిచ్చెనలను ఎక్కుతూ కోరుకున్న గమ్యాన్ని చేరుకోగలుగుతారు. మరి కొందరు దౌర్భాగ్యులు అడుగడుగునా వద్దనుకుంటున్నా పాము నోళ్ళలో చిక్కు కుంటూ పాతాళంలోకిజారుకపోతుంటారు. ఈ రెండో కోవకు చెందిన దాన్నే నేను. చదువు పూర్తయాక ఉద్యోగ ప్రయ త్నంలో నీకు దూరంగా వచ్చేశాను. ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరక లేదుగాని నా జీవితంలో వెలుగు నింపి తన జీవితం పండించుకుంటానన్నాడు

ఒకడు. నమ్మాను. అతని అర్ధాంగి నయ్యాను. సంవత్సరం నిండకుండానే అతనికి నామీద మోజు తీరిపోయి వెగటు ఏర్పడింది. రాధీ అతను మరి కొందరితో కలసి పన్నిన వలలో నేను చిక్కుకున్నాను. పర్యవసానంగా పతితగా మారిపోయాను. ఈ కుళ్ళు జీవితం నుండి బయట పడాలని చాలాసార్లు ప్రయత్నించాను గాని—నా చుట్టూ వున్న ఈ కుళ్ళు మనుషులు నాకా అవకాశం ఇవ్వలేదు. నీ స్నేహితురాలు ఈ స్థితిలో వుందని తెలిస్తే, ఆ బాధకు నీవు తట్టుకోలేవు. అందుకే అందుకే నా వునికి నీకు తెలియజేయలేదు. నీ ఫోటో చూస్తుంటే, నిజంగా నిన్నే చూస్తున్నట్లు ఆనందంతో పొంగిపోతున్నా. నా జీవితంలో మధుర క్షణం యిదొక్కటే" ఎక్కడో దూరాన వున్న రాధతో తన బాధనంతా చెప్పుకొని మనసులోని బరువును కొంతవరకు దించుకొని బాధగా నిట్టూర్చింది అమృత.

ఫోటోను వెనక్కి తిప్పి చూసింది అమృత. "శ్రీవారికి ముద్దులతో రాధ" అని వ్రాసుంది దాని మీద.

"రాధీ ఈ రోజు మీవారి చెంత నాస్థానంలో మరొకరు వుండి వుండచ్చు. కాని నేనుగా నీ జీవిత భాగస్వామిలో నీతోబాటు భాగం పంచుకోలేను" తడిసిన చెక్కిళ్ళను ముని వ్రేళ్ళతో అద్దుకుంటూ అనుకొంది అమృత.

* * *

తెల్లవారాక

పర్సు తెరిచిన శ్రీధరానికి అందులో తన పెళ్ళయిన తొలిరోజు నుండి వుంటున్న తన భార్య రాధ ఫోటో అగుపించలేదు. అంతకు ముందు రోజు వరకువున్న ఆ ఫోటో ఎప్పుడు ఎక్కడ ఎలా పోయిందో శ్రీధరానికి అర్ధంకాలేదు. ★

శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్సు స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద; ఫోన్: 551, తెనాలి (ఏ. పి.)

బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అతి సంభోగం వలన అంగము చిన్నదై సంభోగ కాలమందు అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది. స్పెషలు), హెర్నియా (గిలక), కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టుద్వారా కూడా నయం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులకు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి. క్షయ, ఉబ్బసమునకు ఉచితం, రండి.

బ్రాంచీలు:—తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరవబడును.